# క్రైమ్ కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 161 గుంటూరు, శుక్రవారం 20- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైమ్ కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349





### ప్రపంచ వేదికపై బయటపడ్డ కోల్డ్ వార్..

## ప్రధాని మోదీ పక్కన ఉండగానే..

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 19 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'కు మంచి స్పందన వస్తోంది. 16వ తేదీన ప్రారంభమైన ఈ సమిట్.. 21వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఏఐ సమిట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిగ్గజ ఏఐ కంపెనీలకు చెందిన లీడర్లు ఆయనతో కలిసి స్టేజిపై ఫొటోలు దిగారు. ఈ నేపథ్యంలోనే ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్, ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడీల మధ్య కోల్డ్ వార్ బయటపడింది. స్టేజ్‌పై ఉన్న వారంతా ఒకరి చెయ్యి మరొకరు పట్టుకుని ఫొటోకు ఫోజిచ్చారు. అయితే పక్క పక్కనే ఉన్న సామ్, డారియోలు మాత్రం చేతులు కలపలేదు. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ప్రధాని నరేంద్ర మోదీ పక్కనే సామ్ ఆల్ట్‌మాన్ ఉన్నారు. సామ్ పక్కనే డారియో ఉన్నారు. సామ్ తన కుడి వైపు ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ చేయి పట్టుకున్నారు. ఎడమ వైపు ఉన్న డారియో చెయ్యి పట్టుకోవటానికి మాత్రం ఆలోచించారు.

అటు, ఇటు చూశారు. కానీ డారియో చెయ్యి పట్టుకోలేదు. డారియో కూడా సామ్ చెయ్యి పట్టుకోవటానికి ఆసక్తి చూపలేదు. ఇద్దరి మధ్య చాలా ఏళ్ల నుంచి కోల్డ్ వార్ నడుస్తోంది. డారియో 2021 సంవత్సరానికి ముందు ఓపెన్ ఏఐలో పని చేశారు. సామ్‌తో గొడవల కారణంగా తన సోదరి డానియెలాతో కలిసి బయటకు వచ్చేశారు. 2021లో ఈ ఇద్దరు తోబుట్టువులు కలిసి ఆంథ్రోపిక్ కంపెనీని స్టార్ట్ చేశారు. ఏళ్లు గడుస్తున్నా డారియో, సామ్‌ల మధ్య దూరం మాత్రం తగ్గలేదు. ఇప్పుడిలా ప్రపంచ వేదికపై మరోసారి ఇద్దరి మధ్య కోల్డ్ వార్ ప్రపంచానికి తెలిసిపోయింది.

# 360 డిగ్రీస్ స్కానింగ్!

- ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం వరుస సమీక్షలు
- జిల్లా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్, ఎస్పీతో భేటీలు
- రోజూ అసెంబ్లీ అనంతరం క్యాంపు కార్యాలయంలో నిర్వహణ
- సమస్యలపై చర్చ... అప్పటికప్పుడే పరిష్కారం దిశగా చర్యలు
- అద్దంలో మా ముఖాన్ని మాకే చూపుతున్నట్టుంది: ఎమ్మెల్యేలు




**అమరావతి, ఫిబ్రవరి 19 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏ ఎమ్మెల్యే ఎన్నిసార్లు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు? స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు ఎన్నిసార్లు చేపట్టారు? ఎన్ని ప్రజాదర్బార్లు పెట్టారు? ప్రెస్‌మీట్లు ఎన్ని నిర్వహించారు? సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉన్నారు?.. తదితర అంశాలపై స్పష్టమైన సమాచారం ఉన్న నివేదికలతో ఎమ్మెల్యేల పనితీరును సీఎం చంద్రబాబు సమగ్రంగా సమీక్షిస్తున్నారు. కేవలం ఒక్క నివేదికపైనే ఆధారపడకుండా ఆరేడు నివేదికలు, సర్వే రిపోర్టుల ఆధారంగా తమ పనితీరును ఆయన విశ్లేషిస్తున్న తీరు ఎమ్మెల్యేలనే ఆశ్చర్యపరుస్తోంది. అద్దంలో తమ ముఖాన్ని తమకే చూపుతున్నట్లు ఈ సమీక్షలు ఉంటున్నాయని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నెల 12 నుంచి ఇప్పటివరకు కృష్ణా, చిత్తూరు, కడప, అరకు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం సమీక్షలు నిర్వహించారు. రోజూ అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేల పనితీరు, నియోజకవర్గ స్థితిగతులు, అధికారుల పనితీరు, జిల్లాలో పరిస్థితులపై నివేదికల ఆధారంగా 360 డిగ్రీల్లో సమగ్రంగా.. సూక్ష్మంగా సీఎం సమీక్షిస్తున్నారు. మండల స్థాయి సమస్యలు, తాగు, సాగునీటి ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు, రోడ్లు, మున్సిపాలిటీల్లో సమస్యలు తదితరాలపై చర్చ, పరిష్కారం దిశగా ఈ సమావేశాలు జరుగుతున్నాయి.

**ఇన్‌చార్జి మంత్రుల తీరుపైనా..**

జిల్లా ఇన్‌చార్జి మంత్రుల పనితీరుపైనా సీఎం విశ్లేషిస్తున్నారు. ఎమ్మెల్యేలు, అధికారులతో ఎన్నిసార్లు సమావేశాలు నిర్వహించారని ఓ ఇన్‌చార్జి మంత్రిని ఆయన ప్రశ్నించగా.. ఆ మంత్రి రెండుసార్లు అని చెప్పడంతో.. మీ పనితీరుకు ఆ సంఖ్యే సమాధానమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇన్‌చార్జి మంత్రులు మరింత బాధ్యతతో పనిచేయాలని, సమస్యల పరిష్కారం, పనిచేసిన వారికి గుర్తింపు వంటి విషయాల్లో క్రియాశీలంగా పనిచేయాలని సూచిస్తున్నారు.

**వారికి చురకలు.. వీరికి ప్రశంసలు**

బాగా పనిచేసే వారిని ప్రశంసిస్తూనే వెనుకబడి వారికి చంద్రబాబు సుతిమెత్తగా చురకలు అంటిస్తున్నారు. వారు ఏయే విభాగాల్లో వెనుకబడి ఉన్నారో వివరంగా చెబుతూ మరింత బాగా పనిచేయాలని సూచిస్తున్నారు. జిల్లా అధికారులనూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ విభాగాల పనితీరు, సిబ్బంది కొరత, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, బస్సు సౌకర్యం, పారిశుద్ధ్యం వంటి పలు అంశాలపై సర్వేల ఆధారంగా వారి పనితీరుపై సమగ్రంగా సమీక్షిస్తున్నారు. ఎమ్మెల్యేలు, అధికారులతో ఒకేసారి సమావేశం కావడం ద్వారా జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యలపై సవివరమైన

2లో



## అమరావతి అభివృద్ధికి మరో అడుగు..

**అమరావతి, ఫిబ్రవరి 19 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ మంత్రి నారాయణ నేతృత్వంలో సీఆర్డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై ఇవాళ (గురువారం) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా భూ సమస్యల పరిశీలన, రాజధానిలో పలు సంస్థలకు భూ కేటాయింపులు, కొత్తగా వచ్చే సంస్థలకు భూ కేటాయింపులు, ప్రపంచ స్థాయి సంస్థలను అమరావతికి తీసుకురావడం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. అమరావతిలో కొత్తగా 7 సంస్థలకు భూ కేటాయింపులు చేశామని స్పష్టం చేశారు. 11 సంస్థలకు గతంలో చేసిన కేటాయింపుల్లో మార్పులు చేశామని పేర్కొన్నారు. బ్యాంక్ ఉద్యోగుల నివాసాల కోసం భూ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్‌కు రెండు ఎకరాలు కేటాయించామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్, గుమ్మిడి సంధ్యారాణి హాజరయ్యారు.

## ఏపీ అసెంబ్లీలో కొనసాగుతున్న ప్రశ్నోత్తరాలు..



**అమరావతి, ఫిబ్రవరి 19 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆరో రోజు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాలతో సభను మొదలుపెట్టారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయానికి సంబంధించి ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్ల నిధులు మంజూరు చేశామని... దాంట్లో రూసా కింద రూ.55 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. ఏ కార్యక్రమం చేసినా క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ తీసుకుంటున్నామని తెలిపారు. కర్నూలు పార్లమెంట్ చుట్టు పక్కల ఎక్కువ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. క్లస్టర్ యూనివర్సిటీల్లో ఫోకస్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అందుకే స్పెషలైజేషన్‌లపైనా శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. బ్యాలెన్స్ పనులు వచ్చే అకాడమిక్ ఇయర్‌లో పెండింగ్ నిధులు మంజూరు చేస్తామని మంత్రి లోకేశ్ సభలో పేర్కొన్నారు.

**సమగ్ర శిక్షా అభియాన్ ఒప్పంద ఉద్యోగాలపై..**

సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల వేతనాలను 50 శాతం పెంచే ఉద్దేశం ఉందా అని ఎచ్చెర్ల (శ్రీకాకుళం) ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రశ్నించారు. వీరంతా చాలా తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారి జీతభత్యాలు పెంచాలని, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పార్థసారధి కస్తూరిబా బాలికా విద్యాలయాలపై మాట్లాడారు. కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ఆడపిల్లలకు గొప్పగా విద్యనందిస్తున్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం 79 శాతం ఉత్తీర్ణత ఉన్న స్కూళ్లు త్వరలో 90 శాతం ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని కస్తూరిబా బాలికా విద్యాలయాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు.

ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎంత వేతనం చెల్లిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ జీతాలు ఇస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉందని, ఈ అంశాలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు మంత్రి లోకేశ్. త్వరలోనే వాటిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. డీఎస్సీలో కర్నూలు జిల్లాకు అదనపు ఉపాధ్యాయులను శాంక్షన్ చేశామన్నారు. త్వరలోనే డీఎస్సీని జాబ్ క్యాలెండర్ కింద విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

**క్రైస్తవ ఆస్తులపై ప్రశ్న..**

గతంలో క్రైస్తవ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయా అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అసెంబ్లీలో ప్రశ్న లేవనెత్తారు. గుంటూరులో క్రిస్టియన్ భవన్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని అడిగారు ఎమ్మెల్యే. దీనిపై మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సమాధానం ఇస్తూ.. క్రైస్తవ ఆస్తుల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. జగన్ క్రిస్టియన్ కాదని అనుకుంటున్నానని... ఎందుకు ఐదేళ్ల పాటు ఆ క్రైస్తవ భవన్ పూర్తిచేయలేదని ప్రశ్నించారు. ఎందుకు ఆయన తనహయంలో నిధులు ఇవ్వలేదని అడిగారు. ఇప్పుడు కూటమి వచ్చింది కనుక త్వరలోనే పెండింగ్ పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేస్తామని హామీ ఇచ్చారు. ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం జరుగుతున్నందున జెరుసలేం యాత్రకు ఆస్కారం లేకుండా ఉందని మంత్రి ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.



## సొంతింటి కల నెరవేర్చుకుంటున్న ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ..!

**ఫిబ్రవరి 19 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** హిందూపురంలో హ్యాట్రిక్ విజయంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నందమూరి బాలకృష్ణ... ఇన్ని రోజులు అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురంలో ఓ ఇంటి వాడవుతున్నారు. అదే ఓ సొంతిల్లు కట్టుకుంటున్నారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా గెలిచిన ఎమ్మెల్యే బాలకృష్ణ.. నియోజకవర్గ పర్యటనకు హైదరాబాద్ నుంచి వచ్చి వెళుతుంటారు. అయినా నియోజకవర్గ ప్రజలు కానీ, కార్యకర్తలు, అభిమానులు... ఎమ్మెల్యే బాలకృష్ణ ఎప్పుడు హిందూపురం వచ్చిన అంతే ఉత్సాహంతో ఉంటున్నారు.

ఇటీవల హిందూపురం వైసీపీ ఇంచార్జ్ దీపిక భర్త వేణు, ఎమ్మెల్యే బాలకృష్ణపై సంచలన ఆరోపణ చేశారు. హైదరాబాదులో ఉండే బాలకృష్ణ, హిందూపురంలో పరిపాలిస్తున్నారంటూ విమర్శించారు. వేణు చేసిన కామెంట్స్ హిందూపురంలో హీట్ పుట్టించాయి. ప్రత్యర్థులకు హిందూపురంలో తను స్థానికుడిని కాదు అని చేస్తున్న వ్యాఖ్యలకు.. అవకాశం ఇవ్వకూడదని ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్ణయించుకున్నారు. దీంతో హిందూపురం పట్టణంలో సొంతింటి నిర్మాణానికి రెడీ అవుతున్నారు. హిందూపురం సమీపంలోని వనం కాలనీలో సర్వే నెంబర్ 445లో 81 సెంట్ల భూమిని ఎమ్మెల్యే బాలకృష్ణ కొనుగోలు చేశారు. మూడంతస్తుల భవనంతో పాటు.. స్విమ్మింగ్ పూల్, ఆహ్లాదకరమైన పార్క్ కూడా ఇంటి నిర్మాణంలో ఏర్పాటు చేసుకుంటున్నారట.

హ్యాట్రిక్ విజయంతో హిందూపురంలో దూసుకు

2లో

# 360 డిగ్రీస్ స్కానింగ్!

చర్చ జరగడమే కాకుండా అక్కడికక్కడే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే వెసులుబాటు కలుగుతోంది. చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ వాటికి అవసరమైన నిధుల విడుదలకు సీఎం అక్కడికక్కడే ఆదేశాలు ఇస్తున్నారు. తక్కువ ఖర్చుతో పూర్తిచేసి అందుబాటులో తెచ్చే ప్రాజెక్టులకు వెంటనే నిధులు విడుదల చేయాలని చెబుతున్నారు.


### ఎమ్మెల్యేల్లో సంతోషం

సీఎంతో జరుగుతున్న సమావేశాలపై ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంత ఎక్కువగా జనాల్లో ఉంటే అంత ఎక్కువగా నిధులు ఇస్తానని సీఎం చెప్పడంపై ఓ ఎమ్మెల్యే స్పందిస్తూ.. పనిచేసే వారికి ఇలాంటివి మరింత ఉత్తేజాన్ని కలిగిస్తాయని వ్యాఖ్యానించారు. పనిచేయని, సమస్యలు సృష్టిస్తున్న అధికారులను భరించాల్సిన అవసరం లేదని, పనితీరు మార్చుకోకపోతే వారి స్థానంలో వేరే వారిని నియమించాలని ఎమ్మెల్యేల సమక్షంలోనే కలెక్టర్, ఎస్పీని సీఎం స్పష్టంగా ఆదేశిస్తున్నారు. ఇది అధికారులపై చాలా ప్రభావం చూపిస్తుందని, వారు మరింత వేగంగా.. జవాబుదారీతనంతో పనిచేసేందుకు ఉపయోగపడుతుందని ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు.

## సొంతింటి కల నెరవేర్చుకుంటున్న ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ..!

పోతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ గడిచిన 12 ఏళ్లుగా అద్దె భవనంలోనే ఉంటున్నారు. బాలకృష్ణకు హిందూపురంలో సొంత ఇల్లు కూడా లేదంటూ ప్రతిపక్ష నాయకుడు చేసే విమర్శలకు ఎమ్మెల్యే బాలకృష్ణ ఎట్టకేలకు చెక్ పెట్టేందుకే ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. శుక్రవారం (ఫిబ్రవరి 20) సతీ, సమేతంగా ఎమ్మెల్యే బాలకృష్ణ, వసుంధర దేవి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. తమ అభిమానం నటుడు, హ్యాట్రిక్ విక్టరీ కొట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ కొత్త ఇల్లు ఎలా ఉంటుందో అని హిందూపురంలో ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు..!!

## శ్రీ లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు..!



**క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి:పులిమెల మాణిక్యం.** పల్నాడు జిల్లా,దుర్గి మండల పరిధిలో అడిగొప్పల గ్రామంలో కొలువుదీరిన శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీమణి శోభారాణి జూలకంటి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన శోభారాణికి వేదపండితులు వేద మంత్రాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతించారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సంప్రదాయబద్ధంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుర్ర ప్రమాణ స్వీకార ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రవీణ్





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరావు పెదకూరపాడు నియోజకవర్గం :** గుంటూరు మిర్చి చైర్మన్ కుర్రా అప్పారావు ప్రమాణ స్వీకారం సందర్భంగా కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ , గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావు , పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ జానీ , జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ , సీనియర్ నాయకులు కంచేటి సాయి తదితరులు పాల్గొన్నారు.

## గంగు భాయ్ నీ మనసు వెన్న





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** ఇటీవల ఈ పిల్లలకు దిక్కెవరు అనే వార్త క్రైమ్ కౌంటర్ తెలుగు దినపత్రికలో ప్రచురించడం జరిగింది . పెదకూరపాడు గ్రామంలో ఎస్సీ కాలనీలో ఒకటి రెండు రోజులు తేడాతో భార్యాభర్తలు అనారోగ్యంతో చనిపోయారు. ఈ వార్తను చూసి పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు యువ నేత గుంజ గంగారావు చలించి పోయారు . వెంటనే ఈ పసి పిల్లలకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం గురువారం అందించారు. పి ఫోర్ లో భాగంగా పేద కుటుంబాలను ఆదుకోవడానికి ముందుకు వచ్చారు . బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామం నుండి ఉదయాన్నే పెద కూరపాడు చేరుకొని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మేనత్త మేనమామ రమేష్ మస్తానమ్మకు ఈ సహాయం అందించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆశయాలను కొనసాగిస్తున్నామని తెలుగుదేశం పార్టీ పేదల పక్షాన ఎప్పుడూ ఉంటుందని నిరూపించారు . ఈ కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ జర్నలిస్ట్ క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు, పెదకూరపాడు నియోజకవర్గ పిఫోర్ కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ప్రేరణ ఉత్సవం ని నిర్వహించిన మండల విద్యాధికారులు.!!



**పెద్దవడుగూరు, క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్** మండల స్థాయి ప్రేరణ ఉత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దవడుగూరు నందు ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి మండలంలోని 6 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు కేజీబీవీ ప్రిన్సిపాల్ ప్రస్తుతం పదవ తరగతి మరియు ఇంటర్ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు అందరిని స్కూలు యూనిఫాంలో తీసుకుని రావడం జరిగినది . ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు అందరికీ డోనర్ కే. దివాకర్ రెడ్డి పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీమతి ఉషారాణి గారు ఎంపీడీవో శ్రీ బారెన్ సాహెబ్ గారు, మండల విద్యాశాఖ అధికారులు 1&2 మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల హెడ్మాస్టర్లు మరియు కేజీబీవీ ప్రిన్సిపాల్ హాజరు కావడం జరిగినది. విద్యార్థులందరికీ స్నాక్స్ మరియు భోజనం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో చిన్నవడుగూరు దివాకర్ రెడ్డి, మండల కన్వీనర్ నాగేష్ రెడ్డి, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు,

## శ్రీధర్ అనే సౌండ్ ఉంటేనే పల్నాడు జిల్లా ప్రజల్లో హుషారు



**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పల్నాడు జిల్లా :** పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు, పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మలపాటి శ్రీధర్ పల్నాడు జిల్లా రాజకీయాలలో ఏదైనా పదవుల్లో ఉంటేనే పల్నాడు జిల్లా తెలుగు తమ్ముళ్లలో హుషారు ఉంటుందని, పల్నాడు జిల్లా రాజకీయాలకే కొమ్మలపాటి శ్రీధర్ ఒక కళని బహిరంగంగా పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ హై క్యాడర్ పార్టీ శ్రేణులు తెలుగు తమ్ముళ్లు అంటున్నారు . త్వరగా కొమ్మలపాటిని ఏదో ఒక పదవి ఇచ్చి పార్టీకి అతని సేవలు ఉపయోగించాలని లేకపోతే జిల్లాలో పార్టీ నష్టపోయే ప్రమాదం ఉందని కార్యకర్తలు ప్రజలు సైతం అంటున్నారు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఎమ్మెల్సీ ఇచ్చిందాకా ఏదో ఒక పదవి ఇవ్వాలని చెబుతున్నారు

## ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం

**వ్యవసాయం, పర్యాటక రంగాలపై ప్రత్యేక దృష్టి**

**ఎకో టూరిజానికి ప్రోత్సాహం**

**అరకు, లంబసింగి అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకాభివృద్ధి**

**నీతి ఆయోగ్ ప్రాజెక్టు సమావేశంలో కలెక్టర్ దినేశ్‌కుమార్**



**క్రైమ్ కౌంటర్ న్యూస్):** పాడేరు, ఫిబ్రవరి 19 అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ఏఎస్. దినేశ్‌కుమార్ అన్నారు. విశాఖపట్నం ఐఐఎంలో గురువారం నిర్వహించిన నీతి ఆయోగ్ ప్రాజెక్టు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రధానంగా వ్యవసాయం, పర్యాటక రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు నిలయమైన అల్లూరి జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో అరకులోయ, లంబసింగి ప్రాంతాలను పర్యాటకంగా అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధికి చర్యలు చేపడతామని చెప్పారు. పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. గిరిజనుల సంప్రదాయం, సంస్కృతి, ఆచారాలు, కళలు, వైవిధ్యమైన జీవన విధానాన్ని సైతం పర్యాటకులు తెలుసుకుంటారని కలెక్టర్ చెప్పారు. ఇదే సమయంలో పర్యాటకం అభివృద్ధి చెందడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి లభించి, ఆదాయం పెరుగుతుందని అన్నారు. ఇంకా స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ లభిస్తుందన్నారు. ఏజెన్సీలో నెలకొన్న ప్రత్యేక వాతావరణ పరిస్థితుల వల్ల వ్యవసాయ, ఉద్యాన పంటలను విరివిగా సాగు చేయాలని నిర్ణయించామని, జిల్లా ఆర్థికాభివృద్ధికి వ్యవసాయం రంగం కూడా కీలకం కానున్నదని కలెక్టర్ వెల్లడించారు. గిరిజన రైతులకు అధిక ఆదాయాన్ని ఇచ్చే కాఫీ, మిరియాలు, పసుపు పంటల సాగును ప్రోత్సాహిస్తున్నామని, ఆధునిక పద్ధతిలో సాగు, పండించిన పంటలకు మార్కెటింగ్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. కొత్త జిల్లా అయినప్పటికీ ప్రణాళికబద్ధమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుని అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. చింతపల్లి మండలం లంబసింగి ప్రాంతంలో కుంకుమ పువ్వు సాగుకు గిరిజన రైతులను ప్రోత్సాహిస్తున్నామని కలెక్టర్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, జిల్లా విద్యా శాఖాధికారి కె.రామకృష్ణారావు, ఎల్‌డీఎం మాతునాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్' రివిజన్‌కు సన్నాహక పనులు త్వరగా పూర్తి చేయాలి..




**క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఢిల్లీ, ఫిబ్రవరి 19 దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 2026 నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు పలు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు అత్యవసరంగా లేఖలు రాసింది.

ఏప్రిల్ 2026 నుంచి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మొత్తం 20కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ ఓ కాశ్మీర్, లడఖ్, కర్ణాటక, ఒడిశా, జార్ఖండ్, సిక్కిం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, మహారాష్ట్ర, దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూ ఉన్నాయి.

అధికారులకు ఆదేశాలు..

సర్ కార్యక్రమానికి సంబంధించి సన్నాహక పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఆయా రాష్ట్రాల అధికారులు చర్యలు చేపట్టాలని సూచించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారులు వీలైనంత త్వరగా సన్నాహకాలను పూర్తి చేసి, ఏప్రిల్ 2026 నుంచి ప్రారంభమయ్యే ని సజావుగా జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశం చేసింది.

## కాలుష్య కాసారం.. ఉప్పరిగెడ్డ

**ఫార్మా వ్యర్థాలను బయటకు విడుదల చేస్తున్న కంపెనీలు**
**విషపూరితం అవుతున్న జలవనరులు**
**ఉప్పరి గెడ్డ, ఉప్పుటేరుల్లో చనిపోతున్న చేపలు**
**పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన**



**క్రైమ్ కౌంటర్ న్యూస్):** అచ్యుతాపురం/ రాంబిల్లి, ఫిబ్రవరి 19 అచ్యుతాపురం, రాంబిల్లిల మండలాల పరిధిలోని ఫార్మా కంపెనీల నుంచి శుద్ధిచేయని వ్యర్థాలను నేరుగా బయటకు విడుదల చేస్తున్నారు. దీంతో సమీపంలోని ఉప్పరి గెడ్డలో నీరు నల్లగా మారిపోయింది. ఇందులోని చేపలు మృత్యువాతపడ్డాయి. ఫార్మా వ్యర్థాలను గెడ్డలోకి విడుదలచేయడంపై చుట్టుపక్కల గ్రామాల రైతులు, పూడిమడక మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాంబిల్లి మండలంలో మేజర్ శారదా నది నుంచి ఉప్పరి గెడ్డ విడిపోయి కృష్ణంపాలెం, లాలంకోడూరు, ఎరకన్నపాలెం, చాటమెట్ట, పూడిమడక ఉప్పు గల్లీల పక్కనుంచి ఉప్పుటేరులో కలుస్తుంది. ఉప్పుగిగెడ్డ సమీపంలో పదుల సంఖ్యలో ఫార్మా కంపెనీలు వున్నాయి. ఉత్పత్తి సమయంలో విడుదల అయ్యే వ్యర్థజలాలను పూడి గ్రామం వద్ద నిర్మించిన ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో శుద్ధిచేసి, అనంతరంప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెరువుల్లోకి నీటిని పంపాలి. ఈ చెరువుల్లో పెంచే చేపలకు హాని కలగకపోతే అప్పుడు ఆ నీటిని సముద్రంలోకి విడుదల చేయాలి. కానీ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఇంతవరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ఇక్కడి రసాయన వ్యర్థాలను పరవాడ ఫార్మా సిటీలోని ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు పంపుతున్నారు. అయితే రవాణాతోపాటు ట్రీట్‌మెంట్ చాలా ఖర్చుతో కూడుకున్న పనికావడంతో కొన్ని ఫార్మా కంపెనీలు రసాయన వ్యర్థాలను నేరుగా ఉప్పరిగెడ్డలోకి విడుదల చేస్తున్నాయి. దీంతో గెడ్డ నీరంతా నల్లగా మారిపోయింది. కాలుష్యం కారణంగా ఇందులోని చేపలు చనిపోతున్నాయి. ఈ గెడ్డ నీరు పూడిమడక వద్ద ఉప్పుటేరులో కలుస్తుండడంతో అందులోని చేపలు కూడా మృత్యువాత పడుతున్నాయి. ఉప్పరిగెడ్డలో నీరు తాగి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు అనారోగ్యానికి గురై చనిపోతున్నాయని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు.

## వేసవికంతా చిత్తూరుకు 'అడవిపల్లె' నీళ్లు

**సాంకేతిక అడ్డంకుల పరిష్కారంతో జోరుగా సాగుతున్న పనులు**
**రూ.250 కోట్ల అమృత్ నిధులున్నా పనులు చేయని గత ప్రభుత్వం**


**ఫిబ్రవరి 19 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** – చిత్తూరు అర్బన్, కరువు ప్రాంతంగా ఉన్న చిత్తూరులో తాగునీటి కోసం వేసవి రాకముందే ట్యాంకర్లపై ఆధారపడాల్సిందే. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీయార్ జలాశయాన్ని నిర్మించింది. ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిస్తే.. వాగుల ద్వారా వచ్చే వరదతో జలాశయం నిండేది. ఒకసారి నిండితే నగరంలోని బోర్లతో పాటు జలాశయం నీటిని ఏడాది వరకు చిత్తూరుకు సరఫరా చేసేవారు. ఒకవేళ సమృద్ధిగా వర్షాలు కురవకుంటే ట్యాంకర్లపై ఆధారపడాల్సిందే. ఈ క్రమంలో శాశ్వత నీటి పరిష్కారం చూపేందుకు 2016లో అప్పటి ఎమ్మెల్యే డీఏ సత్యప్రభ, మేయర్ కఠారి అనురాధ అమృత్ పథకం కింద నిధులను మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు. 2018లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు చిత్తూరు నగరపాలక సంస్థ వాటాతో కలిపి రూ. 250కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో పీలేరు సమీపంలోని అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు పైపులైన్ పనులను ప్రారంభించారు. ఏడాది పాటు పనులు జరిగాక ఎన్నికలు రావడంతో ఆగిపోయాయి.

వైసీపీ ఏం చేసింది?

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. తొలి రెండేళ్ల వరకు 'అడవిపల్లె రిజర్వాయరు' నుంచి నీటిని తీసుకొచ్చే పనులను గాలికొదిలేసింది. ఈ పనులు చేపట్టకపోతే అమృత్ నిధులు వెనక్కి తీసేసుకుంటామని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేయడంతో.. పనులను ప్రారంభించి తర్వాత వదిలేశారు.

'కూటమి' వచ్చాక కదలిక

2018లో పనులు ప్రారంభించినా కొన్ని అనుమతులు తీసుకోలేదు. అడవిపల్లె రిజర్వాయర్ కింద 80 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ భూములకు సంబంధించి ఇరిగేషన్ శాఖ అనుమతివ్వాలి. పీలేరు నుంచి చిత్తూరు వరకు రోడ్డు కటింగ్ చేసి పైపు లైన్ వేయాలి. దీనికిగాను హైవే, నేషనల్‌హైవే, పంచాయతీరాజ్ శాఖల అనుమతులు పెండింగులో ఉన్నాయి. దామలచెరువు సమీపంలో నిర్మించనున్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ)కు అనుమతి రావాలి. 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ ఈ పనుల్లో కదలిక వచ్చింది. పెండింగు అనుమతులపై చిత్తూరు నగరపాలక సంస్థ అధికారులు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు నివేదిక అందించారు. వీరు అధికారులతో పలుమార్లు చర్చించి సమస్యలను క్లియర్ చేయడంతో పైపులైను పనులు జోరుగా సాగుతున్నాయి. వచ్చే సమ్మర్‌నాటికి అడవిపల్లె రిజర్వాయర్ నీటిని చిత్తూరుకు తీసుకొచ్చేలా



పనులు చేస్తున్నామని నగరపాలక సంస్థ డీఈఈ పుష్పగిరి నాయక్ తెలిపారు.

మిగిలిన పనులివే

అడవిపల్లె రిజర్వాయర్‌లో ఇంటెక్‌వెల్‌ను తవ్వాలి. మొత్తం కేపాసిటీ 1.43 టీఎంసీలు కాగా అందులో నుంచి 0.78 టీఎంసీల నీటిని చిత్తూరుకు గ్రావిటీ ద్వారా తీసుకురావాల్సి ఉంది. ప్రస్తుతం పెనుమూరు క్రాస్‌లో పైపులైను పనులు జరుగుతున్నాయి. రిజర్వాయర్‌లో ఇంటెక్‌వెల్, దామలచెరువు వద్ద వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, రోడ్డు కటింగ్ పనులతో పాటు మరో పది కిలోమీటర్ల వరకు పైపులైన్ వేయాల్సి ఉంది.

రిజర్వాయరు నుంచి నీళ్ల రాక ఇలా..

అడవిపల్లె రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా పైపులైన్లలో దామలచెరువు వద్ద నిర్మించనున్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు నీటిని సరఫరా చేస్తారు. అక్కడ శుద్ధి చేశాక చిత్తూరుకు చేరుతుంది. నగరంలో ఇప్పటికే ఉన్న కట్టమంచి, సంతపేట, కొంగారెడ్డిపల్లె, కొండమిట్ట, దుర్గానగర్‌కాలనీ, కైలాసపురం ట్యాంకులను నింపుతారు. ఆయా ట్యాంకుల నుంచి సమీపంలో ఉండే కాలనీలకు నీటిని సరఫరా చేస్తారు.

కార్పొరేషన్ వాటా రూ.160 కోట్లు

అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరు వరకు 93 కిలోమీటర్ల పైపులైన్.. దామలచెరువు వద్ద వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, రిజర్వాయర్ వద్ద ఇంటెక్‌వెల్ తదితర పనులకు రూ.250 కోట్లను కేటాయించారు. అందులో దాదాపు రూ.160 కోట్లు చిత్తూరు నగరపాలక సంస్థ ఇవ్వనుంది. దీనికిగాను బ్యాంకులో రుణం తీసుకుని నెలవారీగా కంతులు కడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.25 కోట్లు కేటాయించగా, మిగిలిన రూ.65 కోట్లను కేంద్రం ఇవ్వనుంది.

## తెలంగాణ పోలీసులు పట్టుకున్న ఏపీ ఇసుక వాహనాలు

**సరిహద్దు దాటి తెలంగాణ చేరుతున్న ఇసుక**
**అక్కడి పోలీసులకు పట్టుబడుతున్న వాహనాలు**
**మన రాష్ట్రంలో నిద్రపోతున్న అధికార యంత్రాంగం**
**యథేచ్ఛగా సరిహద్దులు దాటిస్తున్న అక్రమార్కులు**



**క్రైమ్ కౌంటర్ న్యూస్):** కంచికచర్ల) : ఉచిత ఇసుక విధానం వల్ల జిల్లాలో ఇసుక కొరత లేకుండాపోయింది. పెద్దగా గిరాకీ కూడా లేదు. తక్కువ ధరకు ఇసుక అందుతోంది. కానీ, తెలంగాణ జిల్లాల్లో ఇసుక తేలిగ్గా దొరకట్లేదు. ధర ఎక్కువైనా నాణ్యమైనది దొరకడం గగనమే. మన జిల్లాలో జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, మైలవరం నియోజకవర్గాలకు సరిహద్దులుగా తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట, ఖమ్మం జిల్లాలు ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో ఇందిరమ్మ పక్కా గృహాల నిర్మాణాలు జరుగుతుండటం, ఖమ్మంలో రోడ్ల అభివృద్ధి, ఇతర భారీ కట్టడాల నిర్మాణాల వల్ల అక్కడ ఇసుకకు డిమాండ్ ఏర్పడింది.

అక్రమంగా తరలింపు

నందిగామ డివిజన్ పరిధిలో మునేరు, కట్లేరు, వైరాయేరు, పాలేరుతో పాటు కృష్ణానది ఉండటంతో ఇసుక పుష్కలంగా దొరుకుతోంది. అధికారిక రీచ్‌లు, స్టాక్ పాయింట్లు ఉన్నప్పటికీ ఇసుక విక్రయాలు పెద్దగా జరగట్లేదు. మన రాష్ట్రంలో ఉచిత విధానం వల్ల కొరత లేకపోవడం, మరోవైపు ప్రజల నుంచి ఫిర్యాదులు రాకపోవడంతో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఇసుకపై దృష్టి పెట్టట్లేదు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. యంత్రాలతో మునేటిని కొల్లగొడుతున్నారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల మండలాల్లో పలుచోట్ల రాత్రిళ్లు మునేటి నుంచి ఇసుక తవ్వి సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక దందా సాగుతున్నప్పటికీ అడపదడపా పోలీసులు తప్ప మిగతా ప్రభుత్వ శాఖల అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు కూడా లేవు. అధికారుల దాడుల్లేవు. దీంతో అక్రమార్కులు వణుకు బెణుకు లేకుండా నిర్భయంగా ఇసుక వాహనాలను తెలంగాణాకు తరలిస్తున్నారు.

తెలంగాణాలో ఆంధ్ర వాహనాలు సీజ్

రెండు రోజుల క్రితం తెలంగాణా పోలీసులు, ఇతర శాఖల అధికారులు ఇసుక అక్రమ వాహనాలపై కొరడా ఝులిపించారు. కంచికచర్ల మండలం నుంచి ఇసుక తరలిస్తున్న ఏపీ 39 డబ్ల్యూజీ 5777, ఏపీ 39 డబ్ల్యూఎఫ్ 1888 నెంబర్లు కలిగిన రెండు లారీలను తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామం వద్ద తల్లాడ పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. వేంసూరు మండలం వెంకటాపురం వద్ద ఏపీ 39 డబ్ల్యూపీ 2998 నెంబరు కలిగిన టిప్పరును సత్తుపల్లి ఎంవీఐ పోలీసులు పట్టుకున్నారు. జగ్గయ్యపేట ప్రాంతం మల్కాపురం నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బాణాపురం వద్ద ముదిగొండ పోలీసులు పట్టుకున్నారు. సత్తుపల్లి ప్రాంతానికి అక్రమంగా తరలిస్తుండగా, గంగారం సెంటర్ చెక్‌పోస్టు వద్ద టిప్పర్, ట్రాక్టర్‌ను సత్తుపల్లి పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక వాహనాలను సీజ్ చేయటమే కాకుండా, యజమానులు, డ్రైవర్లు, బ్రోకర్లపై కూడా తెలంగాణా పోలీసులు కేసులు నమోదు చేయటం గమనార్హం.


## లాభదాయకమైన క్యాబేజీ సాగు.. నారు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**ఫిబ్రవరి 19 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** క్యాబేజీ సాగులో ఆశించిన దిగుబడి రావాలంటే ప్రాథమిక దశ అయిన నారు పెంపకంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా విత్తనాలు నాటే ముందే నేలను సిద్ధం చేసుకోవడం చాలా ముఖ్యం. పొలాన్ని కనీసం 4 నుంచి 5 సార్లు బాగా కలియదున్నాలి. సుమారు 100 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 25 నుండి 30 గంపల పశువుల ఎరువును వేసి నేలలో కలిసేలా దున్నడం వల్ల భూమి సారవంతం అవుతుంది. ఇలా చేయడం వల్ల మొక్కకు అవసరమైన పోషకాలు లభించి ఆరోగ్యంగా ఎదుగుతాయి.విత్తనాలను నాటిన తర్వాత వాటిపై సన్నని ఇసుక పొరను కప్పాలి. విత్తనాలు మొలకెత్తే వరకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా నీరు పెట్టడం మర్చిపోకూడదు. మొక్కలు మొలకెత్తడం ప్రారంభించిన తర్వాత, వాటి మధ్యలో ఉండే ఎండిన ఆకులను వెంటనే ఏరివేయాలి. ఇలా చేయడం వల్ల గాలి ప్రసరణ బాగుండి, ఇతర మొక్కలకు తెగుళ్లు సోకకుండా కాపాడుకోవచ్చు. నారు దశలో మొక్కలు చాలా సున్నితంగా ఉంటాయి కాబట్టి తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి.నారు దశలో వేర్లకు సోకే నారు కుళ్లు తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఈ వ్యాధి నివారణకు ఒక లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపి నేలను బాగా తడపాలి. ఇది భూమిలో ఉండే శిలీంధ్రాల నుంచి నారును రక్షిస్తుంది. తద్వారా మొక్కలు కుళ్లిపోకుండా, దృఢంగా పెరగడానికి



అవకాశం ఉంటుంది. ఈ జాగ్రత్తలు పాటించడం వల్ల నాణ్యమైన నారును మనం పొందవచ్చు.కేవలం తెగుళ్లే కాకుండా, ఆకుతినే పురుగుల నుంచి కూడా నారును రక్షించుకోవాలి. ఇందుకోసం లీటరు నీటికి 2 మి.లీ. మలాథియాన్ కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. ఇది పురుగుల ఉధృతిని తగ్గించి ఆకులు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా నేల తయారీ నుండి పురుగుల నివారణ వరకు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే, క్యాబేజీ తోటలో మంచి లాభాలను ఆర్జించవచ్చు.

# సినిమా



## బిగ్ బాస్ సోనియా దంపతుల సంచలన నిర్ణయం

సోనియా ఆకుల.. బిగ్ బాస్ తెలుగు రియాలిటీ షో ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో ఈ బ్యూటీ కూడా ఒకరు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఈ ముద్దుగుమ్మ మొదట కొన్ని సినిమాల్లో నటించి మెప్పించింది. 2019లో రిలీజైన జార్జి రెడ్డి సినిమాతో నటిగా అరంగేట్రం చేసింది సోనియా. ఆ తర్వాత రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన ఆశా ఎన్ కౌంటర్, కరోనా వైరస్ సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. ఇలా సినిమాలు చేస్తున్న సమయంలోనే సోనియాకు బిగ్ బాస్ ఆఫర్ వచ్చింది. ఎనిమిదో సీజన్ గా కంటెస్టెంట్ గా హౌస్ లోకి అడుగు పెట్టిన ఆమె తన ఆట, మాట తీరుతో బుల్లితెర ఆడియెన్స్ మనసులు గెల్చుకుంది. అయితే ఎక్కువ రోజులు హౌస్ లో ఉ ండలేకపోయింది. బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చిన వెంటనే వ్యాపారా వేత్త యశ్ ను వివాహం చేసుకున్న సోనియా ఇటీవలే ఓ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటోన్న సోనియా తన భర్త బిజినెస్ ను చూసుకుంటూ బిజీ బిజీగా ఉంటోంది. ఇదిలా ఉంటే సోనియా-యష్ గత కొన్నేళ్ళుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓ ఎన్జీవోను స్థాపించి అవసరమైన వారికి తమ వంతు సాయం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ దంపతులు ఆర్గాన్ డొనేషన్ పై అందరిలో అవగాహన కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా యశ్ సుమారు 450 మంది చేత కళ్లను డొనేట్ చేయించారని తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా తన గురించి తన ఫ్యామిలీ గురించి మరొక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు సోనియా- యశ్ దంపతులు.. తాను సోనియాతో పాటు తన తల్లిదండ్రులు చనిపోతే మా డెడ్ బాడీలు మా కుటుంబ సభ్యులకు సంబంధం లేదని వాటిని గవర్నమెంట్ హాస్పిటల్ కు రాసిచ్చామని తెలిపారు. ' మేము చనిపోయిన తర్వాత మా బాడీ నుంచి ఆర్గాన్స్ తీసుకుని వాటిని ఇతరులకు ఉపయోగిస్తే ఇతరులకు మంచి జీవితాన్ని అందించిన వాళ్లం అవుతాం. అందుకే మా కుటుంబ సభ్యుల డెడ్ బాడీస్ అన్నీ కూడా గవర్నమెంట్ హాస్పిటల్ కి రాసిచ్చాం' అని సోనియా దంపతులు చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట బాగా వైరలవుతున్నాయి. ఇప్పుడు వీరిపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. కాగా తన ఇంటర్వ్యూ చూసినవారు స్వచ్ఛందంగా ఆర్గాన్ డొనేషన్ కు ముందుకు రావాలంటూ కూడా అందరికీ పిలుపు నిచ్చారు సోనియా- యశ్ దంపతులు





## ప్రపంచ కుబేరుల రైస్ ఇది..

సాధారణంగా మన ఇళ్లలో వాడే బియ్యం కిలో రూ. 50 నుండి రూ. 150 వరకు లభిస్తాయి. బాస్మతి రకం అయితే మరో రూ. 100 అదనంగా ఉండవచ్చు. అయితే, ప్రపంచంలో కిన్‌మెమాయ్ ప్రీమియం అనే ఒక ప్రత్యేక రకమైన బియ్యం ఉంది, దీని ధర వింటే చాలా మంది ఆశ్చర్యపోతారు. జపాన్‌కు చెందిన ఈ బియ్యం కిలో కొనాలంటే ఒక బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్ కొనేంత డబ్బు వెచ్చించాలి. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన బియ్యంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది.
జపాన్‌లోని టోయో రైస్ కార్పొరేషన్ ఈ ఖరీదైన బియ్యాన్ని ఉత్పత్తి చేస్తోంది. 2016లోనే దీనికి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన బియ్యంగా గుర్తింపు లభించింది. మార్కెట్‌ను బట్టి కిలో బియ్యం ధర సుమారు 12,500 నుండి 15,000 రూపాయల వరకు ఉంటుంది. కేవలం ధర మాత్రమే కాదు, దీన్ని పండించే విధానం, ప్రాసెసింగ్ పద్ధతి కూడా ఎంతో విలక్షణంగా ఉంటుంది. కిన్‌మెమాయ్ ప్రీమియం బియ్యం అనేది ఏదో ఒక రకమైన బియ్యం కాదు. జపాన్‌లోని గున్మా, నాగనో, నీగాటా వంటి ప్రాంతాల్లో పండే కోషిహికారీ, పికామారు వంటి ఐదు రకాల మేలైన బియ్యం రకాలను కలిపి దీన్ని తయారు చేస్తారు. ఈ కలయిక దాని ప్రత్యేకతకు ప్రధాన కారణం.
దీని ఉత్పత్తిలో ఆరు నెలల నిరీక్షణ కీలక పాత్ర పోషిస్తుంది. బియ్యం కోత కోసిన వెంటనే మార్కెట్‌లోకి రావు. వీటిని దాదాపు ఆరు నెలల పాటు ప్రత్యేక పరిస్థితులలో నిల్వ చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల బియ్యం రుచి, ఆకృతి గణనీయంగా మెరుగుపడతాయని టోయో రైస్ కార్పొరేషన్ చెబుతోంది. ఇది దాని ప్రత్యేకమైన రుచికి, నాణ్యతకు పునాది వేస్తుంది. ప్రత్యేక పాలిష్ విధానం కూడా కిన్‌మెమాయ్ ప్రీమియం బియ్యం యొక్క మరో ప్రత్యేకత. దీని కోసం పేటెంట్ పొందిన ఒక ప్రత్యేకమైన బఫింగ్ ప్రక్రియను ఉపయోగిస్తారు. ఈ పద్ధతి బియ్యం పైపొరను తొలగించినప్పటికీ, అందులోని ముఖ్యమైన పోషక విలువలు ఏమాత్రం నష్టపోకుండా కాపాడుతుంది. దీని వల్ల బియ్యం సహజసిద్ధమైన మంచి గుణాలను నిలుపుకుంటుంది. అద్భుతమైన రుచితో అలరారే ఈ బియ్యంతో అన్నం వండితే అది స్పటికాల్లా మెరుస్తుంది. దీని రుచి కొంచెం తియ్యగా, వెన్నలాగా నోట్లో వేసుకోగానే కరిగిపోయేలా ఉంటుందని బియ్యం రుచి చూసిన భోజన ప్రియులు చెబుతుంటారు. ఈ ప్రత్యేకమైన రుచి అనుభవం దీనిని సాధారణ బియ్యం నుండి వేరు చేస్తుంది. కిన్‌మెమాయ్ ప్రీమియం బియ్యం లగ్జరీ గిఫ్ట్‌గా ప్రాచుర్యం పొందింది. టోయో రైస్ కార్పొరేషన్ ఏడాదికి కేవలం 1000 బాక్సులను మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. ఈ పరిమిత ఉత్పత్తి దాని విలువను మరింత పెంచుతుంది. జపాన్‌లో దీన్ని ప్రతిరోజూ తినే ఆహార పదార్థంగా కాకుండా, అత్యంత ఖరీదైన, విలాసవంతమైన కానుకగా ఇతరులకు ఇస్తుంటారు. ఒక సాధారణ ఆహార పదార్థం కూడా సరైన నైపుణ్యం, ప్రత్యేక పద్ధతులు తోడైతే ఎలా గిన్నిస్ రికార్డు సృష్టిస్తుందో చెప్పడానికి కిన్‌మెమాయ్ ప్రీమియం ఒక నిదర్శనం.



## లోపల ఉంది నిజంగా అమృతమే..

బూడిద గుమ్మడి జ్యూస్ ప్రయోజనాలు:
బూడిద గుమ్మడి జ్యూస్ అనేక ఆరోగ్య సమస్యలకు నివారణగా పనిచేస్తుంది.
బూడిద గుమ్మడి శరీరంలోని రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతుంది.
కడుపునొప్పి, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలను నివారిస్తుంది. ప్రేగులను శుభ్రపరిచి జీర్ణక్రియను క్రమబద్ధీకరిస్తుంది.
గుండె ఆరోగ్యం: రక్త ప్రసరణను మెరుగుపరచి గుండె ఆరోగ్యానికి బలాన్ని చేకూరుస్తుంది.
గుమ్మడి కాలేయం, కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తుంది.
బూడిద గుమ్మడికాయ అధిక రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.
గుమ్మడిలో ఉండే విటమిన్-ఇ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.. కాల్షియం ఎముకలను దృఢంగా చేస్తుంది.
బాడీని డిటాక్స్ చేయడంలో గుమ్మడికాయ ప్రభావవంతంగా ఉంటుంది. శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగించడానికి అద్భుతంగా పనిచేస్తుంది.
బూడిద గుమ్మడికాయలో 96% నీరు, అధిక పీచుపదార్థం, తక్కువ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి ఇది అత్యంత ప్రయోజనకరం. ఒక గ్లాసు జ్యూస్ తాగడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండినట్లు అనిపించి, చిరుతిండ్ల వైపు మనసు మళ్లదు, అతిగా తినడాన్ని నిరోధిస్తుంది.
బూడిద గుమ్మడికాయ యాంటీ-క్యాన్సర్‌గా కూడా పనిచేస్తుందని పేర్కొంటున్నారు.
యాసిడిటీని నియంత్రించి, శరీరాన్ని చల్లబరుస్తుంది.
ఆందోళన చెందేవారు తరచూ ఈ జ్యూస్ తాగితే మంచి ఫలితం ఉంటుంది.
పిల్లలలో జ్ఞాపకశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది.
జ్యూస్ తయారీ విధానం:
బూడిద గుమ్మడికాయను జ్యూస్ చేసేటప్పుడు తొక్క, గుజ్జు, గింజలను తీయకూడదు. ఎందుకంటే వీటిలో కూడా ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కాయను శుభ్రం చేసి, ముక్కలుగా కట్ చేసుకోవాలి.
జూసర్ ఉంటే, కట్ చేసిన ముక్కలను నేరుగా జూసర్‌లో వేసి జ్యూస్ చేసుకోవచ్చు. వడకట్టాల్సిన అవసరం ఉండదు.

## దిమ్మతిరిగే షాకిచ్చిన జింబాబ్వే

టీ20 వరల్డ్ కప్ 2026 గ్రూప్బీ చివరి మ్యాచ్‌లో జింబాబ్వే అద్భుత ప్రదర్శనతో శ్రీలంకను కొలంబోలోనే ఓడించింది. ఈ విజయంతో సూపర్-8కు ముందే గ్రూప్--బీలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఇప్పటికే ఆస్ట్రేలియాను ఓడించి సూపర్-8లోకి అర్హత సాధించిన జింబాబ్వే, ఇప్పుడు శ్రీలంకపై గెలిచి 'గ్రూప్ టాపర్'గా నిలవడం విశేషం.
శ్రీలంకపై గెలిచి గ్రూప్--బీలో టాప్‌కు చేరిన జింబాబ్వే..
ఈ మ్యాచ్‌కు ముందు గ్రూప్--బీలో జింబాబ్వే 3 మ్యాచ్‌ల్లో 5 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, శ్రీలంక 3 మ్యాచ్‌ల్లో 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఫిబ్రవరి 19న కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే శ్రీలంకను ఓడించడంతో పాయింట్ల పట్టిక పూర్తిగా తలకిందులైంది. గ్రూప్ దశలో నాలుగు మ్యాచ్‌లు పూర్తయిన తర్వాత జింబాబ్వే 7 పాయింట్లతో నంబర్--1గా నిలిచింది. శ్రీలంక 6 పాయింట్లతో రెండో స్థానానికి పరిమితమైంది.
శ్రీలంకపై చరిత్ర సృష్టించిన జింబాబ్వే..
శ్రీలంక నిర్దేశించిన 179 పరుగుల లక్ష్యాన్ని జింబాబ్వే 19.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసి ఛేధించింది. ఇది ఐసీసీ టోర్నమెంట్‌లలో శ్రీలంకపై జింబాబ్వే సాధించిన తొలి విజయం. అలాగే టీ20 అంతర్జాతీయాల్లో జింబాబ్వేకు ఇది రెండో అతిపెద్ద విజయవంతమైన రన్ చేజ్‌గా నిలిచింది.
కెప్టెన్ సికందర్ రజా 'మ్యాచ్ విన్నింగ్' ఇన్నింగ్స్..
ఈ విజయానికి కెప్టెన్ సికందర్ రజా ప్రధాన కారణం. అతనితో పాటు ఓపెనర్ బ్రియన్ బెన్నెట్ కూడా అద్భుత అర్ధశతకంతో రాణించాడు. బ్రియన్ బెన్నెట్ 48 బంతుల్లో 63 పరుగులు చేయగా, సికందర్ రజా కేవలం 26 బంతుల్లోనే 45 పరుగులు (2 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి 173కి పైగా స్ట్రైక్‌రేట్‌తో జట్టును గెలిపించాడు.
శ్రీలంక బ్యాటింగ్..
ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు చేసింది. పథుమ్ నిస్సాంక 41 బంతుల్లో 62 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. పవన్ రత్నాయకె 44 పరుగులతో మంచి సహకారం అందించాడు.



## లిస్ట్ లో టీమిండియా ప్లేయర్లు ఎంతమంది ఉన్నారంటే?

క్రికెట్ అభిమానులలో టీ20 ప్రపంచ కప్ ఉత్సాహం తారాస్థాయికి చేరుకుంది. మైదానంలో ఆటగాళ్ల అద్భుతమైన ప్రదర్శనలతో పాటు, వారి నెట్ వర్త్ కూడా గణనీయమైన దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే చాలా మంది ఆటగాళ్ళు అంతర్జాతీయ క్రికెట్, ఫ్రాంచైజ్ లీగ్‌లు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల ద్వారా అపారమైన సంపదను సంపాదిస్న్?న్నారు. ఆదాయాల పరంగా టాప్ 10 క్రికెటర్లు గణనీయమైన ఆర్థిక రికార్డులను సృష్టించారు.
మాక్స్‌వెల్, హార్దిక్ ప్రస్థానం..ఈ జాబితాలో ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్వెల్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఐపీఎల్ ఒప్పందాలు, ప్రపంచ టీ20 లీగ్‌లలో పాల్గొనడం వల్ల అతని నికర విలువ విపరీతంగా పెరిగింది. ఆసియా పిచ్‌లపై అతని అనుభవం జట్టుకు చాలా కీలకం. హార్దిక్ పాండ్యా భారత క్రికెట్‌లో అత్యంత విలువైన వ్యక్తులలో ఒకరిగా పేరుగాంచాడు. రోహిత్, విరాట్ టీ20 నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత, అతను అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడు, అతని ఐపీఎల్ కెప్టెన్సీ కారణంగా అతని ఆదాయం గణనీయంగా పెరిగింది.
బట్లర్, బుమ్రాలకు భారీ డిమాండ్..ఇంగ్లాండ్ కు చెందిన విధ్వంసక బ్యాట్స్ మాన్ జోస్ బట్లర్ ప్రపంచంలోనే మూడవ అత్యంత ధనవంతుడైన క్రికెటర్. గుజరాత్ జెయింట్స్ అతనికి  లో రూ.15.75 కోట్లు చెల్లిస్తుంది. అతని ప్రపంచ మార్కెట్ విలువ చాలా ఎక్కువ. ప్రపంచంలోని అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకరిగా పరిగణించబడే జస్ప్రీత్ బుమ్రా బీసీసీఐ ఏ-కేటగిరీ ఆటగాడు. బుమ్రా ప్రధాన ఆదాయ వనరు అతని కాంట్రాక్టులు, ప్రధాన బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు.
డి కాక్, సూర్యకుమార్ కూడా..
దక్షిణాఫ్రికా వికెట్ కీపర్-బ్యాట్స్ మాన్ క్వింటన్ డి కాక్ రిటైర్మెంట్ నుంచి బయటకు వచ్చి ఈ ప్రపంచ కప్ లో ఆడుతున్నాడు. ఐపిఎల్, ఇతర లీగ్ లలో అతని నిరంతర భాగస్వామ్యం గణనీయమైన ఆర్థిక లాభాలను తెచ్చిపెట్టింది. భారత ప్రస్తుత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆదాయంలో డి కాక్ తో పోల్చదగినవాడు. అతను ఇప్పుడు ప్రపంచ క్రికెట్ లో అతిపెద్ద వాణిజ్య బ్రాండ్లలో ఒకడు, ముంబై ఇండియన్స్ నుంచి రూ. 16.35 కోట్లు అందుకుంటున్నాడు.
లిస్ట్ లో ఫినిషర్లకు కూడా.. యువ బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్ తన దూకుడు బ్యాటింగ్, ఐపీఎల్ విజయంతో తక్కువ సమయంలోనే గణనీయమైన సంపదను సంపాదించాడు. ఈ ఎలైట్ జాబితాలో ఉన్న ఏకైక మలయాళీ ఆటగాడు సంజు సామ్సన్. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్ ఒక పెద్ద ట్రేడ్‌లో కొనుగోలు చేసిన సంజు ఐపీఎల్ జీతం రూ.18 కోట్లు సంపాదిస్తాడు. బలమైన అభిమానుల మద్దతు, బ్రాండ్ విలువ అతన్ని ఈ జాబితాలో ఉంచుతాయి. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఫినిషర్లలో ఒకరైన టిమ్ డేవిడ్, వివిధ దేశాలలో టీ20 లీగ్‌లలో ఆడటం ద్వారా తన సంపదను గణనీయంగా పెంచుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్ జాబితాలో పదవ స్థానంలో ఉన్నాడు. మైదానంలో అతని స్థిరమైన ప్రదర్శనలు, ఫ్రాంచైజ్ క్రికెట్‌లో అతని అధిక డిమాండ్ అతన్ని ఆర్థికంగా అగ్రస్థానంలో నిలిపాయి.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.